# ఆనందో  బ్రహ్మ

- సాయి బ్రహ్మానందం గొర్తి

## నెలనెలా నవ్వుల విందు

### తేడా ...

దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం మాట.

ఈ మధ్యనే కాలం చేసిన ప్రముఖ హాస్య రచయిత డి వి నరసరాజు గారు భీమవరంలో ఓ సభలో ప్రసంగిస్తుండగా, పూర్వపు సినిమాలకీ, నేటి సినిమాలకీ తేడా చెప్పమని అడిగారు. “పూర్వం సినిమాలలో ఏదైనా విషయాన్ని వివరించాలంటే దర్శకుడు చాలా కష్టపడేవారు.ఇప్పటి దర్శకులకి ఆలోచించడం అనే కష్టం లేదు. కష్టమంతా చూసే వాళ్ళకే ! ఉదాహరణకి పెళ్ళి అయినతరువాత హీరోయిన్ గర్భవతి అని చూపించాలంటే, రాత్రి దీపం ఆర్పి తెల్లారేకా ఆమె వాంతి చేసుకునేట్లా చూపిస్తే అందరికీ సులభంగా అర్థం అవుతుందనుకొనేలా తీసేవారు. ఇప్పటి దర్శకులకి అంత కష్టం ఏమీ లేదు. - ఆలోచించాల్సిన అవసరం అంతకంటే లేదు ఎందుకంటే దీపం ఆర్పడాలు, వాంతుల అవసరంలేకుండా తొలిరాత్రి చీకటి సీనులే ఓపెన్‌గా వెలుగులో చూపిస్తున్నారు. ఇంతకంటే పెద్ద తేడా ఏమీ లేదు “ అని తనదైన శైలిలో చెప్పారు. ఇప్పటి సినిమాలు చూస్తే నరసరాజు గారి మాటల్లో నిజం అందరికీ తెలుసు.

# విజిటింగ్  కార్డ్

ఓ తెలుగుభాషంటే అభిమానం ఉన్న ఓ వీరాభిమాని విజిటింగ్ కార్డ్ తెలుగులో అచ్చు వేయించుకోవడానికి వెళ్ళాడు. కార్డ్ అంతా తెలుగులోనే ఉండాలని - ఆయనకి రెండు ఫోన్ లున్నాయని మొదట సెల్లు నంబరు వేసి, దానిక్రింద ఇంటి నంబరు వేయమని ముద్రణాధికారికి చెప్పి మరీ వెళ్ళాడు. ఆ వీరాభిమాని తెలుగుభాషాబిమానం చూసి ముద్రణాధికారి ముచ్చటపడి , కాస్త ఉత్సాహంగా ఈ క్రింది విధంగా కార్డు వేసాడు.

వేటూరి వేంకటేశం

తెలుగు అధ్యాపకులు

**మొదటి సెల్లు:** ౨౩౨౫౨౫౬౬ **రెండో ఇల్లు:** ౨౫౩౨౨౭౦౬

# విచిత్ర ప్రకటనలు

బట్టలుతకమని మీ భార్యని చంపకండి.
LG వారి సహాయం తీసుకోండి.

మీ దంతాలు మీ చేత్తో పీక్కోకండి.
క్లోజ్‌డవున్ టూత్ పేస్టు వాడండి.

## తాపీ  వైద్యం

పంటినెప్పి బాధతో ఉన్న ఓ పిసినారి పేషంటు  ఊళ్ళో ఉన్న ఫేమస్ దంత వైద్యుణ్ణి సంప్రదించాడు.

**పేషంటు:** భరించలేని పంటి నొప్పిగా ఉంది.

**దంత వైద్యుడు:** నో ప్రోబ్లం ! రెండు నిమిషాల్లో పన్ను పీకేస్తాను.

**పేషంటు:** పన్ను పీకడానికి ఎంతవుద్ది?

**దంత వైద్యుడు:** ఒకపన్నుకైతే మూడు వేలు, రెండు పళ్ళయితే అయుదువేలు

**పేషంటు:** ఏమిటి? రెండు నిమిషాల పనికి మూడు వేలా?

**దంత వైద్యుడు:** మీకు కావాలంటే తాపీగా ఓ రెండు గంటలసేపు పన్ను పీక గలను.

## ఏది  కష్టం?

ఓ క్లాసులో టీచర్ పాఠం చెబుతోంది. ఓ తుంటరి విద్యార్థి పాఠం వినకుండా అటూ ఇటూ

దిక్కులు చూస్తున్నాడు.  టీచర్‌కి సహనం నశించింది.

**టీచర్:** నీకస్సల శ్రద్ధ లేదు. నీ చెవులకి వినికిడి కష్టంగా ఉందా?

**విద్యార్థి:** లేదు టీచర్ ! వినికిడి కష్టం కాదు...వినడమే కష్టంగా ఉంది.

## ఏది  ఇష్టం?

పెళ్ళాం: మీకు నాలో ఏది నచ్చుతుంది? నా అందమైన ఫేసా? నా తెలివితేటలా?

మొగుడు: రెండూ కాదు...నీ లోని సెన్స్ ఆఫ్ హ్యూమర్

## అర్ధాలే  వేరులే

ఆడవారి మాటలకీ అర్ధాలే వేరులే అన్నాడు ఓ మహాకవి..

పెళ్ళి అయ్యాక అనుభవంలో ఆ అర్ధాలు స్పష్టంగా తెలుస్తాయి.

మచ్చుక్కి కొన్ని..

భార్య: అవును

అసలు అర్ధం: కాదు

.భార్య: కాదు

అసలు అర్ధం: ( ఖచ్చితంగా ) కాదు

భార్య: మీ ఇష్టం

అసలు అర్ధం: నాకిష్టంలేదు.. అర్ధంకావడంలే!

భార్య: మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి

అసలు అర్థం: **వద్దు.** తేడా వస్తే ..తెలుసుగా

భార్య: పండక్కి పిల్లలకి బట్టలు కొనాలి

అసలు అర్థం: అదే చేత్తో నాకో పట్టు చీర, జత రవ్వల గాజులు

భార్య: నే చేసిన కొత్త వంటలు బాగున్నాయా?

అసలు అర్థం: బాగోలేకపోతే అలవాటు చేసుకు చావండి.

భార్య: నేనేమీ అరవడంలేదు.

అసలు అర్థం: అరుస్తున్నా అర్థంకావడంలేదా?

భార్య: పిల్లాడు లేచినట్లున్నాడు.

అసలు అర్థం: లేచి వెళ్ళి వాడి డయాపర్ మార్చి రండి.

భార్య: నేను లావెక్కానా?

అసలు అర్థం: నేను అందగా ఉన్నానని చెప్పండి. లేకపోతే...

భార్య: మీకు నేనంటే నిజంగా ప్రేమా?

అసలు అర్థం: బిల్లు భారీగా మీకు చెప్పకుండా షాపింగ్ చేసా. !

భార్య: చెప్పేది కాస్త వింటారా?

అసలు అర్థం: మీ పని అయినట్లే...

భార్య: ఇప్పుడే క్షణంలో రెడీ అయ్యి వస్తా!

అసలు అర్థం: హేపీగా పాత సంపూర్ణ రామాయణం సినిమా ఆన్ చేసుకోండి.

భార్య: మీరీ మధ్య నన్ను ఎంతగానో అర్థం చేసుకుంటున్నారు.

అసలు అర్థం: చెప్పి నట్లు చేసి తగలడండి.

భార్య: మీ అమ్మగార్ని ఈ శనివారం తీసుకురండి. ఓ రెండు రోజులుంటారు.

అసలు అర్థం: వచ్చేనెల మా అమ్మా నాన్న వచ్చి రెండు నెలలు ఉంటారు.

భార్య: నాకు వంట్లో బాగోలేదు. మీ మేనల్లుడి పెళ్ళికి మీరెళ్ళిరండి.

అసలు అర్థం: అంతబాగానే ఉంది. నాకే రావడం ఇష్టం లేదు.. అర్థంకావడంలా?

భార్య: పక్కింటి వాళ్ళు సినిమాకి వెళ్ళారట

అసలు అర్థం: సినిమాకి వెళదాం... ఓ ముద్దు ముచ్చట అస్సలు లేవు.

ఇదే జోకు కంటిన్యూ చేద్దాం




వచ్చే నెల తప్పకుండా రండి.